క్లుప్తంగా

చౌడువాడలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భూమిపూజ



సీసీరోడ్లు, డ్రైయినేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ ఎరుకునాయుడు

కె.కోటపాడు : గ్రామ పంచాయతీల్లో ప్రధాన వీధుల్లో సీసీరోడ్లు, డ్రైయినేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు అన్నారు. గ్రామంలో ఆదివారం పలు ప్రధాన వీధుల్లో సీసీరోడ్లు, డ్రైయినేజీల నిర్మాణానికి ఆయన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులను చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాలిబోయిన సంతోష్, భీశెట్టి రామకోటి పాల్గొన్నారు.

దంతాల ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు



పెన్షనర్లకు దంతాల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు సింహాద్రినాయుడు

దేవరాపల్లి : దంతాల ఆరోగ్యంపై అశ్రద్ధ చేయొద్దని యలమంచిలి విజ్జు దంతవైద్యశాల వైద్య నిపుణుడు పి. సింహాద్రినాయుడు సూచించారు. కాశీపురం హైస్కూల్‌లో పెన్షనర్స్ అసోసియేషన్(రిటైర్డ్ ఉద్యోగులు) సమావేశంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి చిన కన్నబాబు, సెక్రటరీ ఆదిరెడ్డి చిన్నంనాయుడు ఆధ్వర్యంలో సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా సభ్యుల యోగక్షేమాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింహాద్రినాయుడు మాట్లాడుతూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వాటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. పింఛనుదారులు అందరికీ సింహాద్రినాయుడు భోజన సదుపాయం కల్పించారు.

సీతారాముల ఆలయంలో భజన కార్యక్రమం



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్ : కె.జె.పురంలో గల సీతారాముల ఆలయంలో శనివారం రాత్రి భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కొంతకాలంగా ధనుర్మాస సమయాల్లో ప్రతి రోజూ రామాలయంలో భజన కార్యక్రమాన్ని గ్రామస్థులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని గ్రామానికి చెందిన బుద్దా శ్రీనివాసరావు తెలిపారు.

బాలవికాస్ తరగతుల నిర్వహణ



కె.కోటపాడు రామాలయం వద్ద విద్యార్థులకు బాల వికాస్ తరగతులు

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామంలో ప్రతి ఆదివారం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బాల వికాస్ తరగతులను నిర్వహిస్తున్నట్టు కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు తెలిపారు. కె.కోటపాడు రామాలయం వద్ద ఆదివారం విద్యార్థులకు బాల వికాస్ తరగతులను నిర్వహించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులు పొందాలని సూచించారు. తోటివారికి సహాయ సహకారాలు అందించాలని విద్యార్థులకు వివరించారు.

నేడు చమ్మచింతలో రెవెన్యూ సదస్సు

నాతవరం : మండలంలో సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. స్థానిక రామాలయం వద్ద జరిగే గ్రామసభకు రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకుంటే నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

విచ్చలవిడిగా ఫ్లెక్సీల ఏర్పాటు

- పన్ను వసూలులో అధికారుల నిర్లక్ష్యం
- నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ఫ్లెక్సీలు, హోర్డింగులు
- పంచాయతీల ఆదాయానికి గండి

కళ్లముందే ఆదాయం కనిపిస్తున్నా... అధికారులు కనికరం చూపుతున్నారు. పంచాయతీల్లో వెలిసే ప్రచార హోర్డింగులు, ఫ్లెక్సీల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉన్నా వాటివైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదు. వీటి వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యానికి ఫలితంగా ఎక్కడబడితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార ప్రచార హోర్డింగులు, ఫ్లెక్సీలు, ప్రకటనల బోర్డులు వెలుస్తున్నాయి.



మాకవరపాలెంలో ఏర్పాటు చేసిన వివిధ పార్టీల ఫ్లెక్సీలు

మాకవరపాలెం : గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ప్రచార బోర్డులు, హోర్డింగ్‌లు క్రమేపీ గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. వ్యాపార సంస్థలు తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులను ప్రచారం చేసేందుకు గ్రామీణ రహదారుల వెంబడి ప్రజలను ఆకర్షించేలా బోర్డులను భారీ సైజులో ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా పంచాయతీలు ప్రకటన పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలి. ఇలా వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు చేపడుతుండాలి. కానీ ఎవరు ఎన్ని హోర్డింగులు, ఫ్లెక్సీలు పెట్టినా పంచాయతీ అధికారులు అటువైపు చూడడం లేదు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

ఏ ప్రాంతంలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేసినా చదరపు మీటరు లెక్కన పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల ఈ బోర్డుల ద్వారా ఏటా పంచాయతీలకు వేలాది రూపాయలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆదిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో వ్యాపారులు, ఇతర సంస్థలకు చెందిన వారు ఇష్టం వచ్చినట్టు బోర్డులు ఏర్పాటు చేసుకుంటూ పోతున్నారు. దీంతో భారీగా ఆదాయానికి గండిపడుతోంది. ప్రధానంగా మాకవరపాలెం మండలంలో తామరం, రాచపల్లి జంక్షన్, మాకవరపాలెం, జీ కోడూరు, జి.వెంకటాపురం, గిడుతూరు, భీమబోయినపాలెం, శెట్టిపాలెం, కొండల అగ్రహారంతోపాటు ఇతర గ్రామాల్లో అధికంగా ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఇంత భారీ మొత్తంలో ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఉన్నా వాటి నుంచి పన్నులు వసూలు చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



విద్యుత్ స్తంభానికి ఉన్న వ్యాపార ఫ్లెక్సీ

నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు

నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల వెంబడి ప్రధాన కూడళ్లలోనూ, విద్యుత్ స్తంభాలకు ఫ్లెకీలు, హోర్డింగులు, ప్రకటన బోర్డులు అమర్చుతున్నారు. ప్రధానంగా పండగలు, జాతరలు, రాజకీయ నాయకుల పర్యటనల సమయంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఏర్పాటు చేసే ముందు పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవడంతో పాటు ప్రచార బోర్డుల సైజుల ఆధారంగా పంచాయతీలకు పన్ను చెల్లించాల్సి ఉంది. వీటిని ఏర్పాటు చేసే స్థలం కూడా పంచాయతీలో నమోదై ఉండాలి. కానీ ఎక్కడా ఇవి అమలు కావడం లేదు.

అనుమతి తప్పనిసరి..

ఫ్లెక్సీలు, ప్రచారబోర్డులు, హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి. అనధికారికంగా ఎవరు బోర్డులు ఏర్పాటు చేసినా తొలగిస్తాం. వినోదపు పన్ను వసూలుకు కార్యదర్శులకు ఆదేశాలిస్తాం.

–సీతామహాలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో, మాకవరపాలెం

క్వారీ వాహనాలను అనుమతించబోం

రోలుగుంట : బుచ్చింపేట గ్రామంలో నుంచి క్వారీ లారీలు రాకపోకలు సాగించడానికి అనుమతించబోమని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. ఆ గ్రామ ప్రాంతంలో వడ్డిప, శరభవరం, రాజన్నపేట క్వారీల నిర్వాహకులతో స్థానిక నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. క్వారీల నిర్వహణతో భారీ లోడుతో తిరుగుతున్న వాహనాల వల్ల ఏర్పడుతున్న కష్ట నష్టాల గురించి చర్చించారు. ఇక్కడ పాల్గొన్న రాజన్నపేట క్వారీ నిర్వాహకుడు బుచ్చింపేట గ్రామంలోకి మరో మార్గం ఏర్పాటు చేసుకుంటామని, అందుకు రెండు నెలలు పడుతుందని అప్పటి వరకూ వాహనాలు తిరగడానికి అనుమతించాలని కోరారు. ఇదే గ్రామానికి చెందిన 15 మందికి తన క్వారీలో ఉపాధి కల్పించానన్నారు. అయితే నాయకులు, యువజన సంఘాలు మాత్రం క్వారీ లారీలు గ్రామంలో నుంచి తిరగడానికి తాము అంగీకరించలేమని స్పష్టం చేశారు.



క్వారీ లారీలకు అనుమతి కావాలని సభలో కోరిన నిర్వాహకుడు

సమస్యలు గుర్తించండి.. పరిష్కరిద్దాం

చీడికాడ : కోనాం జలాశయ పరిధిలో సమస్యలు గుర్తిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం కోనాం జలాశయం వద్ద జరిగిన నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే జలాశయం అభివృద్ధికి ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులతో పాటు జలాశయం పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోరు నిర్మాణ పనులు



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన సర్పంచ్ కాంతమ్మ

రోలుగుంట : కొవ్వూరు గ్రామానికి చెందిన శ్మశాన వాటిక వద్ద ఎంపీపీ వై.ఎనివాసరావుని సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ, పోతలవాని టేంకు అధ్యక్షుడు మలసాల రమణాజి అభ్యర్థన మేరకు తన నిధుల నుంచి బోరు ఏర్పాటుకు నిదులు మంజూరు చేశారు. ఈ నిధులతో సర్పంచ్ ఆదివారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కోరిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎంపీపీకి చెరువు సంఘం కమిటీ, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రోలుగుంట పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ వై.బాబూరావు, పోతలవాని టేంకు ఉపాధ్యక్షుడు చందక నూకారాజు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డుతోనే కార్మికులకు మేలు



మాట్లాడుతున్న లక్ష్మయ్య

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రోడ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లు, కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆల్ ఇండియా రోడ్ మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. డీజిల్ రేట్ల పెంపుదల వల్ల రవాణా రంగ కార్మికులు ఆదాయం కోల్పోయారన్నారు. ఏడాదికి రూ.7 లక్షల వరకు ఒక్కో కార్మికుడి నుంచి ప్రభుత్వాలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో పని చేస్తున్న వారికి సంక్షేమ బోర్డు ద్వారా సహకారం అందించాలని కోరారు.

కేరళ రాష్ట్రంలా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ప్రభుత్వాలే నిర్వహించాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీ అద్దె బస్సుల కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ రాష్ట్ర నాయకుడు వి.తులసీరామ్ మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న హైర్‌బస్ డ్రైవర్లకు అత్యల్ప జీతాలు ఇచ్చి ఇటు ప్రభుత్వం, అటు ఓనర్లు దోపిడీకి పాల్పడుతున్నారని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌గా జి.దేముడిని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. మరో 15 మంది జిల్లా కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఆర్టీసీ హైర్‌బస్ డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏపీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీఎస్‌వీ పరమేశ్వరరావు, నాయకులు వి.వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో తాండవ రిజర్వాయరు

- శిథిలమైన తాండవ గట్టుపై విద్యుత్ లైట్లు
- పొద్దుపోతే చిమ్మచీకట్లో అందాల తాండవ
- పర్యవేక్షణ లేక ఎండుతున్న మొక్కలు
- తగ్గిన సందర్శకుల రాక



మొక్కలు ఎండిపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న తాండవ గట్టుపై కుండీలు



తాండవ ప్రాజెక్టుపై విద్యుత్ లైట్లు

నాతవరం: జిల్లాలో ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు గట్టుపై ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు శిథిలం కావడంతో అంధకారంలో ఉంటుంది. తాండవ ప్రాజెక్టు ఒక పక్క రెండు జిల్లాలు పరిధిలో వేలాది మంది రైతులకు వరి పంట సాగు చేసుకునేందుకు సాగు నీరు సరఫరా చేస్తుంది. మరో పక్క నిత్యం వేలాది మంది మనస్సు దోచే విధంగా పర్యటకులకు ఆహ్లాదాన్ని నింపుతుంది. గతంలో సందర్శకులను అకట్టుకునే విధంగా అప్పటి ప్రాజెక్టు డీఈ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో తాండవ రిజర్వాయరు గట్టుపై కుండీలు ఏర్పాటు చేసి అందంగా కన్పించేలా వివిధ జాతులు మొక్కలు ఏర్పాటు చేశారు. తాండవ ప్రాజెక్టు తిలకించేందుకు వచ్చే సందర్శకులు అందంగా ఉండే మొక్కల వద్ద ఫొటోలు సెల్ఫీలు తీసుకొని సరదాగా గడిపేవారు. అధికారులు పర్యవేక్షణ లేక నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం తాండవ ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు పూర్తిగా శిథిలమై మచ్చుకైనా కన్పించడం లేదు. అలంకారం ప్రాయంగా మొక్కలు లేకుండా కుండీలు కూడా శిథిలమై అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. తాండవ ప్రాజెక్టు చూడటానికి వచ్చే సందర్శకులు ఇక్కడ అధ్వాన పరిస్థితులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైట్లు కొంతకాలంగా వెలగకపోవడంతో వాటికి మరమ్మలు చేపట్టకుండా వదిలేశారు. దీంతో పొద్దుపోతే తాండవ ప్రాజెక్టుపై అంధకారం రాజ్యమేలుతుంది. గతంలో ఇక్కడ ప్రత్యేకంగా ఒకరు పర్యవేక్షణ ఉండేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎవరూ ఉండడం లేదని స్థానికులు అంటున్నారు. తాండవ ప్రాజెక్టును చూసేందుకు ఎవరైనా ఉన్నతాధికారులు లేక ప్రజాప్రతినిధులు వస్తేనే ప్రాజెక్టు అధికారులు ప్రత్యక్షం అవుతున్నారని, లేకపోతే ఎవరూ కనిపించరని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంధకారంలో ఉన్న తాండవ ప్రాజెక్టు గట్టుపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే మొక్కలు శిథిలమై అలంకార ప్రాయంగా కన్పించే కుండీలలో మొక్కలు వేసి తాండవకు పూర్వ వైభవం తీసుకురావాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

వృద్ధులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి

అనకాపల్లి: వృద్ధులు ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా వయో వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు అన్నారు. స్థానిక వి.వి.రమణ రైతు భారతి హాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య కార్డులు, రేషన్ కార్డులు, పింఛన్లు అందజేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృద్ధులకు నెలకు రూ. 6 వేలు పింఛన్ చెల్లించాలని కోరారు. వృద్ధులు సమావేశాలు నిర్వహించుకునేందుకు పట్టణ పరిధిలో ఒక భవనాన్ని ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ విల్లూరు పైడారావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, అన్ని ప్రభుత్వ శాఖల్లో వృద్ధులకు ప్రత్యేక మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదారి అప్పారావు, జి.సాంబవిరాజు, బుద్ద తాతారావు, వి.సత్యనారాయణ, కె.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎన్ఆర్ఐ నవీన్, అల్లాడ సురేష్

నర్సీపట్నం : నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో జరిగిన క్రీడా పోటీలు రసవత్తరంగా జరిగాయి. క్లస్టర్ ఆఫ్ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్‌లో భాగంగా వాలీబాల్, బాక్సింగ్, షాట్‌పుట్, వుషూ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ ప్రథమ బహుమతి స్టేడియం క్రీడాకారులు సాధించారు. షాట్‌పుట్‌లో పెదబొడ్డేపల్లి డాన్‌బాస్కోస్ కాలేజీకి చెందిన శశికుమార్, మహిళా విభాగంలో రిషి కాలేజీకి చెందిన కె.జాహ్నవి గెలుపొందారు. బాక్సింగ్‌లో కుంచా మోక్షిత్, ప్రవీణ్, బాలికల విభాగంలో గండి జ్యోతి, లాస్య గెలుపొందారు. వుషూ పోటీల్లో పెదబొడ్డేపల్లి నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ వుషూ క్రీడాకారులు గెలుపొందారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎన్ఆర్ఐ నవీన్, డైరెక్టర్స్ సుతాపల్లి శ్రావణ్, సుతాపల్లి శ్రీకాంత్, అల్లాడి సురేష్ గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలను సీనియర్ కోచ్ శేఖర్, ప్రియాంక పర్యవేక్షించారు.

160 ఎకరాల్లో వేరుశనగ సాగు



చిరికివానిపాలెంలో సాగులో ఉన్న వేరుశనగ పంట

కె.కోటపాడు : మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు సాగుచేపడుతున్న వేరుశనగ పంట సాగుకు ఇటీవల కాలంలో వర్షాలు మేలు చేకూర్చాయి. రబీ సాగులో భాగంగా డిసెంబర్ రెండో వారం నుంచి వేరుశనగ పంట సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం అల్పపీడన ప్రభావం కారణంగా కురిసిన తేలికపాటి వర్షాలు వేరుశనగ పంటకు మేలు చేశాయి. వేరుశెనగ నాట్లు వేసిన పొలాల్లో పంట ప్రస్తుతం పచ్చగా కళకళలాడుతోంది. కొరువాడ, పోతనవలస, వారాడ, చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, కొత్త అగ్రహారం గ్రామాల్లో 160 ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో వేరుశనగ పంట సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో మంచి దిగుబడి సాధించగలమని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సొసైటీ పదవులపై 'కుల'కలం

- కాపు సామాజికవర్గానికి ప్రాధాన్యం కల్పించాలి
- ఎమ్మెల్యేకు అభ్యర్థనలు

రోలుగుంట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండలంలో కాపు సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం దక్కకపోవడంపై వారిలో అసంతృప్తి ఏర్పడిందనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఇప్పటికే ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు దృష్టికి నేరుగా తీసుకెళ్లారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మండలంలో అధిక ఓటర్లు ఉన్న కాపు, వెలమ సామాజిక వర్గాలకు నామినేటెడ్ పదవులు ఇచ్చే సాంప్రదాయం నడుస్తుంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండు సామాజిక వర్గాల్లోనూ ఆశావహులు పెరిగారు. ప్రధానంగా మండలంలో పార్టీ ప్రెసిడెంటు, శాఖలు వారీగా అధికారులతో వ్యవహారాలు సాగించడానికి సంబంధించి మరో సామాజిక వర్గం హవానే కొనుసాగుతోందనే వాదన వినిపిస్తోంది. మండలంలో గల రెండు పీఏసీఎస్‌ల్లోనూ అధ్యక్ష పదవులకు కూటమికి చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నుంచి ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఇప్పటి వరకూ మండల పార్టీ బాధ్యతలు చూస్తున్న వ్యక్తికి రోలుగుంట పీఏసీఎస్‌లో అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్టు పలువురు చెప్పుకుంటున్నారు. రెండవది జానకీరాంపురం పీఏసీఎస్‌లో కాపు సామాజిక వర్గం నుంచి టీడీపీ నుంచి, జనసేన నుంచి కూడా పదవులు ఆశిస్తున్నారు. ఇక్కడ కూడా కాపులకు కాకుండా చేయాలని ఇదే పార్టీవారు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎమ్మెల్యే రాజు శనివారం మండలస్థాయి పార్టీ నాయకులతో సమావేశమై సామాజిక వర్గాల అభిప్రాయాలు సేకరించారు. వీరిలో కాపు సామాజికవర్గానికి చెందిన కొండపాలెం, కొవ్వూరు, బల్జిపాలెం, రత్నంపేట, కొంతలం తదితర గ్రామాలకు చెందిన నాయకులు తమకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నట్టు చెబుతున్నారు. దీంతో మండలంలో భవిష్యత్‌లో కాపులకు నామినేటెడ్ పదవుల్లో స్థానం దక్కుతుందా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

ఊపందుకున్న రబీసాగు



సత్యవరంలో వేసిన రబీ వరినాట్లు

మాడుగుల : ఖరీఫ్ సీజన్ పూర్తి కావడంతో పాటు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులను నిరాశ పరిచింది. వరి పంటకు తెగుళ్లు సోకడంతో పాటు, నవంబర్ మాసం నుంచి వరుస తుపానుల వల్ల కోసిన వరి పంట నీట తడిసింది. ఈ దృష్ట్యా రైతులు రబీ వరి పంట మీద దృష్టి సారించారు. పెద్దేరు జలాశయం దిగువన ఇప్పటికే రబీ వరినాట్లు ప్రారంభించారు. సత్యవరం, ఒమ్మలి, జంపెన, తదితర గ్రామాల్లో రబీ వరినాట్లు వేయడం ప్రారంభించారు. మండలంలో 3,556 ఎకరాలులో వరి నాట్లు వేయడానికి రైతులు సన్నద్ధం అయ్యారు. ఇప్పటికే సుమారు 100 ఎకరాల్లో వరినాట్లు పూర్తి చేశారు. అపరాలు సాగుకు బదులుగా రబీ వరినాట్లు వేస్తున్నారు.

10న వెంకన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు

మాడుగుల రూరల్ : కె.జె.పురంలో గల శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాపేటి రామకొండలరావు తెలిపారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలను చేయడంతో పాటు భక్తులకు ఉత్తర ద్వారదర్శనం కల్పించనున్నట్టు ఆయన తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రికి సహస్ర దీపాలంకరణ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని రాపేటి రామకొండలరావు తెలిపారు.

ఐక్యతతోనే బీసీ కులాల అభివృద్ధి



మాట్లాడుతున్న అంగడాల పూర్ణచంద్రరావు

అనకాపల్లి: కుల గణన ద్వారానే బీసీల అభివృద్ధి జరుగుతుందని బీసీ కులాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఆదివారం బీసీ కులాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా పొందుతున్న రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో బీసీలకు దక్కాలంటే బీసీ కులాల విభజన జరగాలని కోరారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో బీసీ కులాలు తీవ్రంగా వెనుకబాటుకు గురవుతున్నాయని, బీసీలంతా ఐక్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బీసీ కులాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.సి. రమణ మాట్లాడుతూ బీసీలు తమ హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. కో–కన్వీనర్ కె.శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఇప్పటికే బీసీలు పూర్తిగా వెనుకబడిపోయారని, రాజకీయంగా బీసీలకు దక్కవలసినవి దక్కలేదన్నారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, గుడాల సత్యనారాయణ, బొట్టా చిన్నయాదవ్, కోన లక్ష్మణ్, బొడ్డేడ అప్పారావు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బొబ్బిలి గోవిందరావు, వాసుపల్లి తాతయ్యలు, ఎస్.వి.వి.రామచంద్రరావు, సూదికొండ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నేటికీ అందని జీతాలు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా ఉపాధ్యాయులకు 1వ తేదీనే జీతాలు వేస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది జూన్‌లో మాత్రమే 1వ తేదీన జీతాలు వేశారని, తర్వాతి నెల నుంచి జీతాలు సరిగ్గా వేయడం లేదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.